క్లుప్తంగా

లయన్స్‌క్లబ్ సేవలు అభినందనీయం



బాటసారులకు అంబలి అందజేస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

కడ్తాల్: లయన్స్‌క్లబ్ ఆఫ్ ఆమనగల్లు ఆధ్వర్యంలో చేపడుతున్న సామాజిక సేవా కార్యక్రమాలు అభినందనీయమని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో లయన్స్ ఆధ్వర్యంలో 100 రోజుల పాటు, వేసవిలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు ఏర్పాటు చేసిన రాగి అంబలి కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా క్లబ్ డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ చెన్నకిషన్‌రెడ్డి పర్యవేక్షణలో అందిస్తున్న సేవలను ప్రశంసించారు. క్లబ్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు జహంగీర్ అలీ, ప్రభు, రాజేందర్‌యాదవ్, తరుణ్ తదితరులు ఉన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



విష్ణుకు నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

ఆమనగల్లు: నాయిబ్రాహ్మణ సేవాసంఘం తలకొండపల్లి మండల నూతన అధ్యక్షుడిగా నీలకంఠ విష్ణును ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన సంఘం సమావేశంలో అధ్యక్షుడిగా విష్ణు, గౌరవాధ్యక్షుడిగా చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడిగా శేఖర్, ప్రధాన కార్యదర్శిగా చంద్రకుమార్, కోశాధికారిగా రమేశ్, ప్రచార కార్యదర్శిగా వెంకటేశ్, సభ్యులుగా పర్వతాలు, భిక్షపతి, మహేశ్, సత్యనారాయణ, శివ, వెంకటేశ్, ప్రవీణ్, రమేశ్, జగన్‌లను నియమించారు.

ఇంటర్ పరీక్షలకు సిద్ధం



హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న అధికారులు

ఆమనగల్లు: నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఆమనగల్లు పట్టణంలో గతంలో రెండు పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా.. ప్రస్తుతం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఒకే కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ మేరకు మంగళవారం అధికారులు పరీక్ష కేంద్రంలో హాల్ టికెట్ల నంబర్లు వేశారు. ఈ సెంటర్లో ఆమనగల్లు ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు, ప్రమీళమ్మ జూనియర్ కళాశాల, కడ్తాల్ మండల కేంద్రంలోని బ్రిలియంట్, ఎస్‌వీఎస్ కళాశాలల నుంచి ఫస్ట్ ఇయర్‌లో 1387 మంది, సెకండ్ ఇయర్‌లో 1300 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. కేంద్రంలోని గదులను చీఫ్ సూపరింటెండెంట్ మాధవరావ్, డిపార్ట్‌మెంట్ అధికారి అనంతరెడ్డిలు పరిశీలించారు. విద్యార్థులు పరీక్ష కేంద్రానికి ఉదయం 8.30 గంటల లోపు చేరుకోవాలని సూచించారు.

పీఆర్‌టీయూ సంబురాలు



స్వీట్లు తినిపించుకుంటున్న సంఘం నేతలు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎమ్మెల్సీగా శ్రీపాల్‌రెడ్డి విజయం సాధించడం గర్వకారణమని పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు పరమేష్ హర్షం వ్యక్తంచేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నంలో విజయోత్సవ సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపించుకున్నారు. శ్రీకాంత్, చంద్రశేఖర్, రాజు, జమీర్, హరిప్రసాద్, పవన్‌కుమార్, ఉషారాణి, దీప్తి, చంద్రశేఖర్, రమేష్, మల్లేశ్, ఆనంద్‌కుమార్, రాజు, గోవర్దన్, మహేశ్ పాల్గొన్నారు.

8న లయన్స్‌క్లబ్ జిల్లా సమావేశం

ఆమనగల్లు: లయన్స్‌క్లబ్ 320ఏ జిల్లా సమావేశం ఈ నెల 8న సికింద్రాబాద్‌లోని క్లాసిక్ గార్డెన్స్‌లో జరగనుందని లయన్స్‌క్లబ్ జిల్లా గవర్నర్ కోటేశ్వర్‌రావ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథిగా లయన్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబురావ్, మాజీ డైరెక్టర్ సునీల్‌కుమార్, ఎల్‌సీఐఎఫ్ ఏరియా లీడర్ నరేందర్‌రెడ్డి, దీపక్ భట్టాచార్య తదితరులు పాల్గొననున్నారని ఆయన పేర్కొన్నారు.

ఊపందుకున్న ‘ఉపాధి’

- ప్రస్తుతం పనిచేస్తున్న కూలీల సంఖ్య వెయ్యి
- ఐదు వేలకు పెంచేందుకు అధికారుల కసరత్తు
- భూగర్భ జలాల పెంపునకు ఫాంపాండ్స్ తవ్వకాలపై దృష్టి
- రైతుల ఆసక్తితో భూముల చదును



చింతుల్ల గ్రామంలో ఫాంపాండ్స్ పనులు చేస్తున్న కూలీలు

యాచారం: గ్రామీణ ఉపాధిహామీ పనులు మండలంలో ఊపందుకున్నాయి. వరినాట్లు, ఇతర వ్యవసాయ పనులు తగ్గుముఖం పట్టడంతో ప్రజలు ఉపాధి పనుల వైపు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో క్రమంగా కూలీల సంఖ్య పెరుగుతోంది. మండల పరిధి 24 గ్రామ పంచాయతీల్లో మొత్తం 13,056 జాబ్ కార్డులు ఉన్నాయి. కూలీల సంఖ్య 26,660 ఉండగా.. ఏటా 16,500 మంది మాత్రమే పనులకు వెళ్తున్నారు. కొందరు తమ వ్యవసాయ పొలాల్లో పనులు చేస్తూ హాజరు నమోదు పొందుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా.. ప్రస్తుతం వెయ్యి మంది వరకు కూలీ పనులు చేస్తుండగా.. ఆ సంఖ్యను పెంచేందుకు అధికారులు దృష్టి సారించారు. అందుకు ప్రతివారం కూలీ డబ్బులు చెల్లిస్తే.. కూలీల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, ఆ దిశగా వారంవారం కూలీ చెల్లించాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

60 నీటి గుంతలు

వర్షాలు కురిసిన వెంటనే గుంతల్లో నీరు చేరి, భూగర్భ జలాలు పెంచేందుకు అధికారులు ప్రణాళిక సిద్ధం చేశారు. ఇందులో భాగంగా ఈ ఏడాది 24 గ్రామాల్లో 40 నుంచి 60 వరకు ఫాంపాండ్స్(నీటి గుంతలు) తీయించనున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఫాంపండ్స్ 12 మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో రెండు మీటర్ల లోతు వరకు తీయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ఒక్క ఫాంపాండ్స్ పూర్తి చేస్తే.. కూలీలకు రూ.లక్ష వరకు వేతనాలు చెల్లించే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి కూలీ రేటును రూ.300 వరకు పెంచింది. అదే విధంగా రైతుల ఆసక్తిని బట్టి వారివారి వ్యవసాయ పొలాల్లో చదును పనులు చేసేలా నిర్ణయించారు. రాళ్లు, రప్పలు, మట్టి దిబ్బలను తొలగించి, పంటలకు యోగ్యంగా మార్చడం, కంపచెట్లు తొలగించడం వంటి పనులు చేపట్టేందుకు అధికారులు కృషి చేస్తున్నారు.

రెండు పూటలా పని

ప్రస్తుతం పనిచేస్తున్న కూలీల సంఖ్య వెయ్యికి పైగా ఉండగా.. వారం రోజుల్లో ఐదు వేలకు పెంచేందుకు అధికారులు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. జాబ్ కార్డులు పొందిన ప్రతి కుటుంబం ఉపాధి పనుల్లో భాగస్వామ్యం అయ్యేలా కార్యదర్శులు, ప్రత్యేకాధికారుల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పిస్తున్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకుని ఉదయం, సాయంత్రం రెండు పూటలా ఉపాధి పనులు చేసుకోవాలని సూచిస్తున్నారు. యాచారం, గునుగల్, నక్కర్తమేడిపల్లి, కొత్తపల్లి, మాల్, మంతన్‌గౌరెల్లి, నందివనపర్తి, చింతపట్ల గ్రామాల్లో ఉపాధి పనులకు కూలీలు అధికంగా వచ్చేలా దృష్టి సారించారు. కూలీల సంఖ్య పెంచడం, పనుల్లో అవకతవకలు లేకుండా హాజరు నమోదు చేసి, ఫొటోలు తీయనున్నారు.

“ప్రతీవారం వేతనం ఇవ్వాలి



గ్రామాల్లో పనులు దొరకకపోవడంతో ఉపాధి పనులకు వెళ్తున్నాం. కానీ చేసిన పనులకు ప్రతీవారం కూలీ జమచేస్తే కుటుంబ అవసరాలకు పనికొస్తుంది. రెండు వారాల నుంచి పనికి వెళ్తున్నాను. కానీ డబ్బులు జమ కాలేదు. ఎప్పటికప్పుడు డబ్బులు చెల్లించేలా చూడాలి.

– అనూష, ఉపాధి కూలి, కొత్తపల్లి

భూగర్భ జలాల పెంపునకు..



వర్షాలు కురిసినప్పుడు వరద నీరు వృథాగా పోతుంది. అందుకే పొలంలో ఫాంపాండ్స్ తవ్విస్తున్నాను. వీటితో బోరు బావుల్లో భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంది. అధికారుల సూచన మేరకు ఈ నిర్ణయం తీసుకున్నాను. నాలాగే చాలా మంది గుంతలు తవ్వించేందుకు ఆసక్తి చూపుతున్నారు.

–జర్పుల హతిరాం, రైతు, మంతన్‌గౌడ్

సద్వినియోగం చేసుకోండి



కూలీలు ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలి. నిబంధనల ప్రకారం పనులు పూర్తి చేస్తే గిట్టుబాటవుతుంది. కూలీల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నాం. వారం, వారం కూలీ డబ్బులు అందేలా చూస్తాం. జాబ్ కార్డున్న వారందరూ ఉపాధి పనులు చేసుకుంటే బాగుంటుంది.

– నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ, యాచారం

పట్టుదల విజయానికి సోపానం

సీఐ శివప్రసాద్



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

కడ్తాల్: పట్టుదల, క్రమశిక్షణతో చదివితే అద్భుత విజయాలు సాధిస్తారని సీఐ శివప్రసాద్, ఎస్ఐ వరప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో పదో తరగతి విద్యార్థినులకు మంగళవారం వీడ్కోలు సమావేశంతో పాటు, ప్రథమ వార్షికోత్సవం ఏర్పాటు చేయగా.. వారు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పరీక్షలంటే భయం వీడాలని, ఒత్తిడికి గురికావద్దని సూచించారు. అనంతరం ఎస్ఓ అనిత పరీక్ష విధానం, అత్యధిక మార్కులు సాధించడం తదితర అంశాలపై విద్యార్థులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు పాఠశాలతో తమకున్న అనుబంధాన్ని, తీపి జ్ఞాపకాలను తోటి వారితో పంచుకుని కన్నీటి పర్యంతమయ్యారు. బాలికల సాంస్కృతిక ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సర్కారు బడిలో ఆధునిక సౌకర్యాలు



థింగ్ బిగ్ స్పేస్‌లో పాల్గొన్న విద్యార్థులు, అమెజాన్ ప్రతినిధులు

యాచారం: సర్కారు బడిలో ఆధునిక సౌకర్యాలు కల్పించేందుకు ఓ ప్రైవేట్ సంస్థ ముందుకు వచ్చింది. మంగళవారం మండల పరిధి నందివనపర్తి ఉన్నత పాఠశాలలో అమెజాన్ సంస్థ 12వ థింగ్ బిగ్ స్పేస్‌ను ప్రారంభించింది. ఇందులో భాగంగా విద్యార్థులకు ఆధునిక సౌకర్యాలు, ల్యాప్‌ట్యాప్‌లు, డీఐవై కిట్లు, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పించనున్నారు. ప్రత్యేకంగా ల్యాబ్‌ను ఏర్పాటు చేసి, సైన్స్ టెక్నాలజీ, ఇంజినీరింగ్, ఆర్ట్స్, గణితం విద్యను అందించనున్నారు. కార్యక్రమంలో సంస్థ డీసీఓ క్లస్టర్ మేనేజర్ శ్రీ షాజి నారాయణ, ప్రతినిధులు తాతాజీజీ, శ్రీరామ్ అంకెం, పాఠశాల హెచ్‌ఎం వెంకటరమణ శాస్త్రి, ఉపాధ్యాయులు కిషన్ తదితరులు పాల్గొన్నారు.

పంటలకు నీటిని పొదుపుగా వాడండి



మంతన్‌గౌరెల్లిలో వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారి రవినాథ్

యాచారం: ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పంటలకు నీటిని పొదుపుగా వాడాలని మండల వ్యవసాయ అధికారి రవినాథ్ రైతులకు సూచించారు. మండల పరిధి మంతన్‌గౌరెల్లి, నల్లవెల్లి, చింతపట్ల, నందివనపర్తి తదితర గ్రామాల్లో మంగళవారం వరి పంటలను ఆయన పరిశీలించారు. అవసరానికి తగినట్లుగా నీటిని పొదుపుగా వాడాలని, అధికంగా నీరు పారించి వృథా చేయరాదని పేర్కొన్నారు. నీరు తక్కువగా ఉండే రైతులు.. మడులలో తడిగా ఉండేటట్లు జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. స్వల్ప కాల పంటల సాగుపై రైతులు దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు వసంత, సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి



మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధి 28వ డివిజన్ కాలనీలో నిలిచిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కార్పొరేషన్ మేనేజర్ నాగేశ్వర్‌రావుకు వినతిపత్రం అందచేశారు. అనంతరం పలువురు మాట్లాడుతూ.. శ్రీమారుతినగర్ కాలనీలో డ్రైనేజీ పనులు పూర్తి చేయకుండా వదిలేశారని ఆరోపించారు. కాలనీ డ్రైనేజీలను అవుట్‌లెట్‌కు అనుసంధానం చేయకుండా నిలిపివేశారని పేర్కొన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం వలన కాలనీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని విమర్శించారు. 1,8,9 లైన్లలో డ్రైనేజీని అసంపూర్తిగా వదిలివేశారని, 5,6,7 లైన్లను ఎవరూ పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఫలితంగా ఈగలు, దోమలు పెరిగి ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులుస్పందించి అసంపూర్తి పనులను పూర్తి చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో అగిరిశెట్టి సైదులు, ప్రవీణ్, చైతన్య, మహేశ్, బాపనయ్య, అరవింద్, శ్రీనివాస్, యాదగిరి, మహేందర్, రతన్ తదితరులు పాల్గొన్నారు.

కేన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

మాడ్గుల: మండల పరిధి అప్పారెడ్డిపల్లి గ్రామానికి చెందిన పల్లెటి జనార్దన్ కేన్సర్ వ్యాధితో బాధ పడుతూ నగరంలోని బసవతారకం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పలవెంకటేశ్.. మంగళవారం ఆస్పత్రిలో బాధిత కుటుంబ సభ్యులను కలిశారు. రూ.10 వేల ఆర్థిక సహాయం అందజేశారు. ప్రభుత్వం తరఫున సహకారం అందేలా చూస్తామని హామీ ఇచ్చారు.

నివాళి

కడ్తాల్: యువ నాయకుడు శ్రీను మృతి కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. మండల పరిధి కర్కల్‌పహాడ్‌కు చెందిన శ్రీను.. మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే.. మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుడి కుమారుల చదువుకు తోడ్పాటునందిస్తానని హామీ ఇచ్చారు. ఆయన వెంట మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, హన్మానాయక్ తదితరులు ఉన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోవాలి

పహాడీషరీఫ్: లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం (ఎల్ఆర్ఎస్)కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ బి.వెంకట్రామ్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. అనుమతులు లేకుండా లేఅవుట్ చేసిన వెంచర్‌లలోని ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసేకునేందుకు ఎల్ఆర్ఎస్ కోసం గతంలో రూ.1000 చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న ప్లాట్ల యజమానులు అర్హులన్నారు. అనధికారిక లేఅవుట్‌లలోని ప్లాట్లను రెగ్యులరైజ్ చేసుకునేందుకు ఈ నెల 31వరకు ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకున్నవారు ప్రభుత్వ గడువులోపు ప్లాట్లను రెగ్యులరైజేషన్ చేసుకుంటే ఎల్ఆర్ఎస్ మొత్తం ఫీజులో 25శాతం రాయితీని ఇస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న ప్లాట్ల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మడిగెల బకాయి చెల్లించండి

తుక్కుగూడ: మున్సిపాలిటీ దుకాణ సముదాయ మడిగెల అద్దె బకాయి చెల్లించాలని కమిషనర్ ఎ.వాణి సూచించారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ.. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా ఎవరెవరు ఎంత బకాయి పేరుకుపోయారో నిర్వాహకులకు తెలిపామని చెప్పారు. పూర్తి బకాయి చెల్లించి, పుర అభివృద్ధికి సహకరించాలని, లేని పక్షంలో దుకాణాన్ని సీజ్ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మేనేజర్ పర్వతాలు, సీనియర్‌అసిస్టెంట్ మల్లేశ్, వార్డు అధికారులు, బిల్‌కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

8నుంచి గోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



గోపాలస్వామి, రుక్మిణి సత్యభామ ఉత్సవ మూర్తులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండలం చుక్కాపూర్ గ్రామ సమీపంలోని కలికిదోన గుట్టపై వెలసిన శ్రీ గోపాలస్వామి దేవాలయంలో ఈ నెల 8 నుంచి 13 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల ఏర్పాట్లను ఆలయ ఫౌండర్ చైర్మన్ సిద్ధాంతి పట్టాభి రామశర్మ ఆధ్వర్యంలో చేస్తున్నారు. ఉత్సవంలో భాగంగా 8న గోపాలస్వామి కల్యాణం, 11న రథోత్సవం నిర్వహించనున్నారు.

కార్యక్రమాల వివరాలు

ఈ నెల 8న ఉదయం గణపతిపూజతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయి. అనంతరం అంకురార్పణ, ప్రత్యేక పూజలు, ఉదయం 11 గంటలకు గోపాలస్వామి కల్యాణోత్సవం, రాత్రికి హనుమంత వాహనసేవ, 9న ప్రత్యేక పూజలు, గరుడవాహన సేవ, 10న స్వామివారికి పూజలు, అర్చనలు, చిన్న రథోత్సవం, 11న చుక్కాపూర్, ఖానాపూర్ గ్రామస్తుల భజనలు, పూజలు, తెల్లవారుజామున పెద్ద రథోత్సవం, 12న దోపోత్సవం, గజవాహనసేవ, 13న చక్రతీర్థం, పూర్ణాహుతితో ఉత్సవాలు ముగుస్తాయి. ఉత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో రావాలని పట్టాభి కోరారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయండి

- సీపీఎం జిల్లా నాయకుడు జగన్
- గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేలు



సర్వే చేస్తున్న సీపీఎం నాయకులు

ఇబ్రహీంపట్నం రూరల్: అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం పార్టీ జిల్లా నాయకుడు పి.జగన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మండలం రాయపోల్ గ్రామంలో పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటి సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక, ప్రజా సమస్యలను విస్మరించిందని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా గ్రామసభల ద్వారా ఇందిరమ్మ ఇళ్ల అర్హులను ఎంపిక చేయాలని సూచించారు. అర్హులకు పింఛన్లు మంజూరు చేయాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో రేషన్ కార్డుల జారీలో తీవ్ర జాప్యం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన మాటకు కట్టుబడి.. వెంటనే కొత్త రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. ఈ నెల 1వ తేదీ నుంచి 5 వరకు సర్వే చేసి, సమస్యల పరిష్కారానికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వెల్లడించారు. 27న కలెక్టరేట్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం మాజీ ఎంపీటీసీ భిక్షపతి, నాయకులు పెర్క యాదయ్య, అచ్చన రాములు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి తోడ్పాటు



పూజాకార్యక్రమంలో పాల్గొన్న రాఘవేందర్‌రెడ్డి

ఆమనగల్లు: ఆలయాల అభివృద్ధికి ఐక్యత ఫౌండేషన్ తోడ్పాటునందిస్తుందని టాస్క్ సీఓఓ, ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని శ్రీకంఠ మహేశ్వర స్వామి దేవాలయంలో నూతనంగా నిర్మించిన శ్రీ పబ్బతి ఆంజనేయస్వామి ఆలయాన్ని మంగళవారం ఆయన సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సుంకిరెడ్డిని ఆలయ కమిటీ ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా సుంకిరెడ్డి మాట్లాడుతూ విద్య, ఉపాధి లక్ష్యంగా పని చేస్తున్న ఫౌండేషన్.. ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తుందని, ఇందులో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలోని పలు దేవాలయాల అభివృద్ధికి భారీగా నిధులు అందజేశానని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవ కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ అల్లాజీగౌడ్, ప్రధాన కార్యదర్శి గంగా రవీందర్‌గౌడ్, కోశాధికారి గజ్జె బాలకృష్ణగౌడ్, నాయకులు నిరంజన్‌గౌడ్, యాదయ్య, వెంకటయ్య, గోదా సతీష్‌గౌడ్, నర్సింహగౌడ్, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

న్యాయమూర్తి స్వరూప



ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న న్యాయమూర్తి స్వరూప తదితరులు

ఆమనగల్లు: ఉన్నత లక్ష్యంతో చదివితే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, కృషి, పట్టుదల, క్రమశిక్షణ విజయానికి సోపానాలని ఆమనగల్లు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కాటం స్వరూప అన్నారు. పట్టణంలోని వివేక విద్యాభారతి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సైన్స్‌ఫెయిర్‌ను మంగళవారం టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డితో కలిసి ఆమె ప్రారంభించారు. విద్యార్థులు రూపొందించిన ఎగ్జిబిట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల మనో వికాసానికి సైన్స్‌ఫెయిర్లు దోహదపడతాయన్నారు. సృజనాత్మకత, నైపుణ్యత పెరిగి నూతన ఆవిష్కరణలకు అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. అనంతరం జడ్జి స్వరూప, రాఘవేందర్‌రెడ్డిలను సత్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్, ఎంఈఓ పాండు, ఎస్ఐ సీతారాంరెడ్డి, లయన్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు పాపిశెట్టి రాము, సత్యసాయి సేవాసమితి సభ్యుడు డాక్టర్ దొంతు పుల్లయ్య, ట్రస్మా బాధ్యుడు అల్లాజీగౌడ్, శివలింగం, నిరంజన్, వెంకటేశ్, సంజీవ్‌కుమార్, పాఠశాల కరస్పాండెంట్ గోలి శ్రీనివాస్, ప్రిన్సిపాల్ మహమూద్, అడ్వైజర్ ఏవీశర్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

మంచాల: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధి ఆగాపల్లి గ్రామంలో సాధురం కంటి వైద్యశాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా 50 మందికి నేత్ర పరీక్షలు నిర్వహించారు. అందులో 10 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.ఎస్.రెడ్డి, కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు, పీఏసీఎస్ డైరెక్టర్ రమేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బాలరాజు, జగన్, యాదగిరి, సాయిలు, యాదయ్య, నర్సింహ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయం

- పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి
- ఎమ్మెల్సీ గెలుపుపై మండల కేంద్రంలో సంబురాలు



సంబురాలు చేసుకుంటున్న నాయకులు

మహేశ్వరం: రానున్న స్థానిక ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మిద్దె సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్సీ ఎన్నికల్లో మల్క కొమురయ్య ఘన విజయం సాధించడంపై మండల కేంద్రంలో నేతలు మిఠాయిలు పంచుకొని, టపాసులు కాల్చి సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి మల్క కొమురయ్య మొదటి ప్రాధాన్యత ఓట్ల లెక్కింపులో ఘన విజయం సాధించడంపై ఆనందం వ్యక్తం చేస్తున్నామన్నారు. రాష్ట్రంలో రోజురోజుకు బీజేపీ బలపడుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుస్తారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలే బీజేపీని గెలిపిస్తాయన్నారు. అంతకుముందు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు బస్వ పాపయ్య గౌడ్, జిల్లా కార్యదర్శి అయిల్ల యాదయ్యగౌడ్, మండల అధ్యక్షుడు టి.యాదిశ్, కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్‌యాదవ్, మండల మాజీ అధ్యక్షుడు మాధవచారి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పంతునాయక్, దేశ్యానాయక్, ముత్యం, సురేష్, రఘుపతిగౌడ్, దేవేందర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.